ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





డెల్టాను వెంటాడుతున్న వర్షాభావం

ఎండిపోతున్న వరి పైరు

నీరు కోసం నోరుతెరిచిన పొలాలు





ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, ప్రకాశం బ్యారేజి నుంచి నీరు బాగా వస్తుందని ఆశించిన కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి సాగు చేసిన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు వర్షాభావం, మరోవైపు కాల్వలకు సరైన పద్ధతిలో నీరు రాక పోవడంతో వెదపద్ధతిలో సాగు చేసిన వరి పైరు ఎండుముఖం పట్టింది. ప్రధానంగా తెనాలికి సమీపంలోని పలు గ్రామాల్లో రైతులు తీవ్ర సంకోభంలో చిక్కుకున్నారు. గుంటూరు జిల్లాలోని డెల్టా ప్రాంతంలో 1.66 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటివరకు 1.25 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. ఇందులో 80 శాతం వెదపద్ధతిలో సాగు చేశారు. కాల్వలకు నీరు రాకచాలా ప్రాంతాల్లో పైరు ఎండు ముఖం పట్టింది. కొన్ని గ్రామాల్లో నీరు లేక నేల నెర్రెలు ఇచ్చి వరిపైరు ఎందుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రకాశం బ్యారేజికి పట్టిసీమ నుంచి 5500 క్యూసెక్కులు, పులిచింతల నుంచి 3వేల క్యూసెక్కులు వస్తుంది. మొత్తంగా తూర్పు డెల్టా (కృష్ణాజిల్లా)కు 4,799 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా (గుంటూరు,బాపట్ల జిల్లాలు) 3868 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ సమయంలో కనీసం ఆరు వేల క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. కానీ కేవలం 3,868 క్యూసెక్కులు విడుదల చేయడం వల్ల చాలా ప్రాంతాలకు నీరు రావడం లేదు. ప్రకాశం బ్యారేజికి చేరువగా ఉన్న తెనాలి రూరల్,పెదకాకాని మండలంలోని పలు గ్రామాలకు నీరు అందక వరిపొలాలు బెట్టకు వస్తున్నాయి. అలాగే వర్షాభావం వల్ల జిల్లాలో మరో 40వేల ఎకరాల్లో వరినాట్లు వేయాలా వద్దా అని రైతులు పునరాలోనలోపడ్డారు. దాదాపు 15 రోజులుగా సరైన వర్షాలు లేకపోవడం, వేడిగాలులు పెరగడం, వేసినపంటలే బెట్టకు వచ్చినీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ ఏడాది పూర్తిస్థాయిలో వరిసాగు జరుగుతుందాలేదా అన్న ప్రశ్నార్ధకంగా మారింది. పులిచింతలలో గరిష్ట నీటినిల్వ 45.77 క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 21టిఎంసిలు మాత్రమే ఉంది. ప్రస్తుతం ఆరుతడి పంటలు సాగుచేసుకోవడం మేలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మరో వైపు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో కూడా వరిసాగు పరిస్థితి గందరగోళంలో పడింది. సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వలకు నీరు విడుదల కాకపోవడంతో పత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లోని దాదాపు 40 వేల ఎకరాల్లో వరి సాగు నిలిచిపోయింది. అలాగే జిల్లాలో 76 వేల ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 44 వేల ఎకరాల్లోనే పంట వేశారు. అలాగే మిర్చి సాగు కూడా నిరాశజనకంగా ఉంది. 40 వేల

2లో

వారా బందీ విధానంతో నీరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డెల్టాలో ఇప్పటికే సాగు చేసిన వరి పంటను కాపాడుకునేందుకు వీలుగా వారా బందీ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో సూచించినట్లు తెలిపారు. ఆగస్టులో ఎక్కువ రోజులు వర్షాలు లేకపోవడం, మరోవైపు వేడిగాలుల తీవ్రత వల్ల కొన్ని గ్రామాల్లో నీరు పూర్తిగా అందక పంటలు బెట్టకు వస్తున్నాయని తెలిపారు. వేసిన పంటలను కాపాడుకునేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

తెలంగాణా రాష్ట్ర గవర్నర్‌కు కలెక్టర్ స్వాగతం

ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలోని ఎస్ ఆర్ ఎం యూనివర్శిటీ 3 వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా శనివారం తెలంగాణా రాష్ట్ర గవర్నర్ మరియు పుదుచ్చెరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ హాజం య్యారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం యూనిర్సిటీ వద్ద గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.

పోలీసు స్టేషన్‌లో ఘర్షణ... ఎస్ఐకు గాయాలు


2లో



గుంటూరులో 41వ వార్డు సచివాలయం వద్ద నిరసనలో మాట్లాడుతున్న కె నళినికాంత్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం సమరభేరీ

వార్తలు లోపలి పేజీల్లో



వినుకొండలో వినతిపత్రం ఇస్తున్న ఏపూరి గోపాలరావు తదితరులు

వివాదంలో మంత్రి రజని మామ

కాంట్రాక్టరుపై చేయిచేసుకుంటున్న వీడియో బహిర్గతం


ప్రజాశక్తి -చిలకలూరిపేట

స్థానిక పురుషోత్తపట్నంలో నిర్మిస్తున్న వేణుగోపాల స్వామి దేవాలయం నిర్మాణంలో గుడి కాంట్రాక్టర్ పై మంత్రి విడదల రజని మామ లక్ష్మీనారాయణ చేయిచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆలయంలో జరగుతున్న పనుల్లో ఉన్నలోపాలపై కాంట్రాక్టరును ప్రశ్నించ గా జరిగిన వాదోపవాదాల్లో లక్ష్మీ నారాయణ కోపంతో నిన్ను చంపేస్తా ననటంతో ఆ కాంట్రాక్ట్ ర్ చంపండి అంటున్నారు. ఎదురు చెప్తావా కాంట్రాక్టర్ గొంతు పట్టుకున్నా రని, తనకే ఎదురు చెబుతావా అంటూ బెదిరింపులు చూశారని దీంతో మధ్యవర్తులు కాంట్రాక్టర్ ని నిర్మాణం చెయ్యమనగా దానికి ఆ కాంట్రాక్టర్ టిటిడి ఏ.ఈ., డి.ఈ., లు ఇద్దరూ చెబితేనే నిర్మాణం చేస్తానని స్పష్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు కూడా కాంట్రాక్టరును బెదిరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వీడియో ఆధారంగా విచారణ చేస్తున్నట్టు సిఐ రాజేశ్వరరావు తెలిపారు.

4న ధర్నాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

అధిక ధరలు, నిరుద్యోగ సమస్య, విద్యుత్ ఛార్జీల పెంపును నిరశిస్తూ, ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వాలని తదితర సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న మండల తహసీల్దార్ కార్యాల యాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయా యన్నారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ.450లు ఉన్న గ్యాస్ సిలిండర్ ఇప్పుడు రూ.1200లకు పెరిగిందన్నారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రధాని కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వకపోగా, ఉన్న పరిశ్రమలను మూసివేసి నిరుద్యోగాన్ని పెంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రజాగాయకులు గద్దర్ కుమార్తె వెన్నెల

ఓటు ప్రజల ఆయుధం కావాలి

గద్దర్ సంస్మరణ సభలో ఆయన కుమార్తె వెన్నెల

3లో

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ప్రజాగాయకులు గద్దర్‌కు నివాళి

డెల్టాను వెంటాడుతున్న వర్షాభావం

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల్లో మిర్చి సాగు కావాల్సి ఉండగా కేవలం 14 వేల ఎకరాల్లోనే వేశారు. సాగర్ జలాశయంలోనీరు లేకపోవడం వల్ల ఈఏడాది మిర్చిసాగు కూడా ఇంతవరకు ఊపందుకోలేదు. మిర్చికి తప్పని సరిగా రెండు మూడు తడులకు నీటి అవసరం ఉంది. సాగర్ నుంచి నీరురాకపోతే మిర్చి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. దీంతోరైతులు మిర్చిసాగుకు ధైర్యంగా ముందుకు వెళ్లలేకపోయారు. ఆగస్టు నెలలో వర్షాభావం వల్ల మెట్టప్రాంతంలో సాగు మందగనంగాసాగుతోంది. జిల్లాలో జూన్ నెలలో 97.1 మిల్లీమీటర్లకు గాను 105.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది.జులైలో 164.9 మిల్లీ మీటర్లకు గాను 255.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఆగస్టులో 164.7 మిల్లీ మీటర్లకు 102.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది.



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న పోలా భాస్కర్, కాంతారావు

క్రేన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

ప్రజాశక్తి-గుంటూరు

క్రేన్ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు గ్రంధి సుబ్బారావు, లక్ష్మీ నరసమ్మల పేరుతో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినుల కోసం సకల సౌకర్యాలతో నూతన వసతి గృహ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించడం ద్వారా గ్రంధి వెంకట సత్యలక్ష్మీ కాంతారావు ధన్యజీవులని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో క్రేన్ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన రెండు అంతస్తుల విద్యార్థినుల వసతి గహాన్ని క్రేస గ్రూపు సంస్థల చైర్మన్ జివిఎస్ఎల్ కాంతారావుతో కలిసి కమిషనర్ డాక్టర్ భాస్కర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాభివద్ధిలో అమెరికా, చైనాల తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలో దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జివిఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల స్ఫూర్తితో నిజాయితీగా సేవలందించే సంస్థలకు తమ ఆర్థిక సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమా జోత్స్నకుమారి, తులసి మస్తానమ్మ, డాక్టర్ కోగంటి విజయబాబు, వార్డెన్ కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



మోదీన్ బికు నగదును పంపిణీ చేస్తున్న భవనం రాఘవరెడ్డి

మట్టిఖర్చులకు పదివేలు అందజేత

ప్రజాశక్తి-నకరికల్లు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. నకరికల్లు లోని పాతూరు ముస్లిం బజారులో మృతి చెందిన షేక్ మస్తాన్ బి నామిని మోదిన్ బికు, అలాగే పోలీస్ స్టేషన్ పక్కన గల ప్రాథమిక పాఠశాల వెనక బజారులో చనిపోయిన కొమరోలు శ్రీనివాస రావు భార్య వరలక్ష్మిలకు వైఎస్సార్ బీమా కింద ఒక్కొక్కరికి మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల నగదును శని వారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీని యర్ నాయకులు శాగం చంద్రశేఖర్ రెడ్డి, పరస సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి భావన్నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కాసిం సైదా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఘర్షణ... ఎస్ఐకు గాయాలు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ముప్పాళ్ల పోలీసుస్టేషన్ లో శుక్రవారం అర్ధరాత్రి హైడ్రామా నెలకొంది.బొల్లవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఈపూరి వెంకటేశ్వర రెడ్డి, బాబయి శ్రీనివాసరెడ్డి సత్తెనపల్లి నుండి కారులో వస్తుండగా ఎదురుగా వస్తున్న సత్తెనపల్లి పట్టణానికి చెందిన శివ, సాయిలు ద్విచక్రవాహనంపై వస్తూ కారును ఢీకొట్టారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. శివ, సాయిలు కారు అద్దాలు పగలగొట్టి వెళ్ళిపోయారు. వెంకటేశ్వరరెడ్డి ముప్పాళ్ల పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కారు అద్దాలు పగలగొట్టిన ఇద్దరు వ్యక్తులను ముప్పాళ్ల పోలీసు స్టేషన్ కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో వెంకటేశ్వర రెడ్డికి చెందిన మద్దతు దారులు భారీ స్థాయిలో అక్కడకు చేరుకుని వారిని తమకు అప్పగించాలని కోరగా ఎస్ఐ ససేమిరా అనడంతో పోలీసులకు, వెంకటేశ్వరరెడ్డి మద్దతు దారులకు తోపులాట జరిగింది.ఈ క్రమంలో అడ్డుకోబోయిన ఎస్ఐ కిషోర్ బాబుకు గాయాలయ్యాయి. వెంటనే సంఘటన స్థలానికి డిఎస్పీ ఆదినారాయణ పోలీసు సిబ్బందితో వచ్చి లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ విషయంపై ఎస్ఐ కిషోర్ బాబును వివరణ కోరగా స్టేషన్ లో గొడవలేమి జరగలేదనీ తమ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇబ్బంది కలిగిందనీ తెలియడంతో వచ్చారని తెలిపారు. ఈ అంశంపైమాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ స్పందిస్తూ పోలీసులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు ఎవరు రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు.

నీరుగారిన స్వచ్ఛ సంకల్పం

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- పారిశుధ్య కార్మికులుగా క్లాప్ మిత్రాలు!
- షెడ్ల వద్ద మౌలిక వసతుల లేమి



పంచాయతీ పారిశుధ్య కార్మికుల్లా మారిన క్లాప్ మిత్రాలు!

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

"క్లీన్ ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నాం" అని ఏడాది క్రితం ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. కృష్ణాజిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం అమలవుతోందని జిల్లా అధికారులు చెబుతున్న మాటలను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన జగనన్న స్వచ్ఛ సంకల్పం లక్ష్యం ఆచరణలో నీరుగారుతోంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి క్లాప్ మిత్రాల వేతనాలు నిలిచిపోవడం, మౌలిక వసతులు సమకూరకపోవడంతో జిల్లాలో ఈ పరిస్థితి నెలకొంది.

కోడూరు మండలంలో లింగారెడ్డిపాలెం, పోటుమీద, జయపురం, మాచవరం, రామకృష్ణాపురం, వి.కొత్తపాలెం ఆరు పంచాయతీల్లోనూ చెత్త సేకరణ జరగడం లేదు. అవనిగడ్డ పంచాయతీలో క్లాప్‌మిత్రాలు సేకరించిన చెత్త డంపింగ్ యార్డుకు తరలిపోతోంది. గతంలో పనిచేసిన మొవ్వ, పెదపారుపూడి గ్రామ పంచాయతీల్లోని సంపద కేంద్రాలు మూతపడ్డాయి. జివో నంబర్ 680 ప్రకారం కేంద్ర ప్రభుత్వ గ్రాంటు రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు రూ.4 వేలు కలిపి రూ.10 వేలు ఇవ్వాలని అడిగినందుకు కృత్తివెన్ను మండలం పాంద్రాక గ్రామ పంచాయతీలో ఆరుగురు క్లాప్ మిత్రాలను పంచాయతీ పాలకవర్గం తొలగించింది. సంపద కేంద్రాన్ని మూతవేసింది. తోట్లవల్లూరులో సంపద తయారీ కేంద్రాన్ని ఆరేళ్ల క్రితం కృష్ణానది ఒడ్డున నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన తాటాకు కప్పును తొలగించి ఏడాదిన్నర క్రితం రేకుల షెడ్‌గా మార్చారు. అది ఇప్పటికీ నిరుపయోగంగానే దర్శనమిస్తోంది. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తను కృష్ణా కరకట్టపైన వేస్తున్నారు. జిల్లాలో 491 గ్రామ పంచాయతీలకుగానూ 472కుపైగా

నీరుగారిన స్వచ్ఛ సంకల్పం

గ్రామ పంచాయతీల్లో లక్షలాది రూపాయలు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఉపయోగించి షెడ్లను నిర్మించారు. వాటిల్లో సింగిల్ డిజిట్ గ్రామ పంచాయతీల్లో కూడా చెత్త నుంచి సంపద సృష్టి జరగడంలేదు.

250 గృహాలకు ఒకరు చొప్పున జిల్లాలోని 491 గ్రామ పంచాయతీల్లో 2,685 మంది క్లాప్ మిత్రాలను నియమించాలి. షెడ్ మేనేజ్‌మెంట్‌కు వాచ్‌మెన్లను, సూపర్ వైజర్లను నియమించాలి. ఆదిశగా చర్యలు లేవు. అవసరమైన సిబ్బందిలో సగం మందిని కూడా గ్రామ పంచాయతీల్లో నియమించలేదు. 1273 మంది క్లాప్ మిత్రాలు మాత్రమే పనిచేస్తున్నారు. 2022 ఏప్రిల్ వరకు క్లాప్ మిత్రాల వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా విడుదల చేశాయి. ఆ తర్వాత నుంచి నిలిపివేడంతో పంచాయతీల నిధుల నుంచే క్లాప్ మిత్రాలకు వేతనాలు ఇవ్వాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థికంగా వెసులుబాటులేని మైనర్ పంచాయతీలకు సంపద కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. వేతనాలు చెల్లిస్తున్న గ్రామ పంచాయతీలు నిర్దేశించిన చెత్త సేకరణ, సంపద కేంద్రాల నిర్వహణ విధులు అప్పగించకుండా పంచాయతీల్లో పారిశుధ్య, ఇతర అవసరాలకు వారిని ఉపయోగించుకుంటున్నాయి. సంపద కేంద్రాల నిర్వహణ గాలికి వదిలేశాయి.

మౌలిక వసతుల లేమి

సంపద తయారీకి షెడ్ల వద్ద చెత్త కటింగ్ మిషన్, చెత్తను కుళ్లబెట్టేందుకు వాటర్ బోర్, ఎరువు తయారీకి వానపాములు, ఇతర యంత్రాలు, విద్యుత్ సౌకర్యం అవసరం. గ్రామాల్లో చెత్త సేకరణకు 967 ట్రైసైకిళ్లకుగాను 547 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 645 ట్రైసైకిళ్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమకూర్చాల్సి ఉంది. 322 షెడ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. 251 షెడ్లకు వాటర్ కనెక్షన్లు లేవు. 73 షెడ్లకు రోడ్డు వసతి లేదు. ఈ మౌలిక వసతులు సమకూర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో స్వచ్ఛ సంకల్పం లక్ష్యం నీరుగారుతోందనే చర్చ జరుగుతోంది.

కృష్ణా వర్శిటీని సందర్శించిన అధికారుల బృందం

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : స్టాఫ్ సెలక్షన్ కమీషన్ (ఎస్.ఎస్.సీ)-2021 ద్వారా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్‌గా ఎంపికై కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలలో విధులు నిర్వర్తిస్తున్న 37 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ 9 వారాల ట్రైనింగ్ ప్రోగ్రాం విలేజ్ అటాచ్మెంట్, భారత్ దర్శన్ లో భాగంగా కష్ణా యూనివర్సిటీ ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ కి యూనివర్సిటీ బిజినెస్ మానేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ డి.సూర్య చంద్ర రావు, బిజినెస్ మానేజ్మెంట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ సీహెచ్. జయ శంకర ప్రసాద్ యూనివర్సిటీ కి సంబంధించిన వివిధ రకాల విభాగాల గురించి, పరిపాలన అంశాల గురించి, పద్ధతుల గురించి, చట్టాల గురించి, మేనేజ మెంట్ నందు ప్రిన్సిపుల్స్, ప్రాక్టీసెస్, ఫంక్షన్స్ గురించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి మాట్లాడుతూ క్రొత్తగా ఎంపికైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ కి అభినందనలు తెలుపుతూ దేశ నిర్మాణంలో,శాసనాల రూప కల్పనలో వివిధ విభాగాలలో పనిచేసే అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ముఖ్య భూమిక పోషించాలని కాబట్టి నైపుణ్యాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమం లో రిటైర్డ్ జడ్జి జయసూర్య, బయో టెక్నాలజీ మరియు బయో సైన్సెస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

5న జాబ్ మేళా

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి : విజయవాడ గవర్నమెంట్ ఐటిఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉపాధి శాఖ, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపిఎస్ఎస్‌డిసి), సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో హోమ్ హెల్త్ కేర్ లిమిటెడ్, డిమార్ట్, ఫ్లిప్‌కార్ట్‌తోపాటు మరో ఐదు ప్రైవేటు సంస్థలు పాల్గొంటున్నాయి. దాదాపు 830 పోస్టులకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లను www.ncs.gov.in లో నమోదు చేసుకోవాలని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉపాధి అధికారి డి విక్టర్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకున్న వారితో పాటు నమోదు చేసుకోలేని వారు తమ బయోడేటా, సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలు, అడ్రస్ ప్రూఫ్, ఆధార్ కార్డు కాపీలతో ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ ఐటిఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ముఖాముఖికి నేరుగా హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు.

సరికొత్తగా రాయల్ ఎన్‌ఫీల్డ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మోటార్ సైక్లింగ్, ఆటోమోటివ్ చరిత్రలో శాశ్వతమైన పేరును లిఖించుకున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 సరికొత్త వాహనాన్ని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి ఎం.డి. ఎస్. ప్రసాద్ తెలిపారు. నగరంలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్ షిప్ వద్ద ఆయన మాట్లాడుతూ కొత్త రూపం రాయల్ ఎన్‌ఫీల్డ్‌గా, మిడ్ సైజ్ 250 సిసి, 750 సిసి మోటార్ సైకిల్ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా కొనసాగుతుందన్నారు కొత్తగా 2023 బుల్లెట్ 350ని మార్కెట్లోకి తీసుకువచ్చి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. సూపర్ రిఫైన్డ్, స్మూత్ జె సిరీస్ ఇంజన్ ప్లాట్‌ఫారమ్‌పై రాయల్‌ఎన్‌ఫీల్డ్ తన స్టామినాను ప్రదర్శించిందని తెలిపారు. ఈమోటార్ సైకిల్ తొమ్మిది దశాబ్దాల వారసత్వం కలిగి ఉందన్నారు. స్థిరత్వం కలిగిన సౌందర్యం, హస్తకళల కలయికతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని కొత్త మోడళ్లను తీసుకురానున్నట్లు తెలిపారు.

'ఐసిఐసిఐ గిఫ్ట్ ప్రో' ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వినూత్నంగా గిఫ్ట్ ప్రో పథకాన్ని ప్రారంభించినట్లు సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాలా తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆయన వివరాలను తెలియచేశారు. వినూత్న ఆదాయ ప్రణాళికగా ఎంచుకునే వారికి గిఫ్ట్ ప్రో పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇది వినియోగదారులకు ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఆదాయాన్ని లేదా స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశాన్ని అందిస్తుందన్నారు. అదనంగా ఈనాన్ పార్టిసిపేటింగ్ సేవింగ్స్ ప్రొడక్ట్ యొక్క లైఫ్ కవర్ భాగం కుటుంబ ఆర్థిక భద్రతను కూడా అందిస్తుందన్నారరు. ఐసిఐసీఐ గిఫ్ట్ ఫ్రో కస్టమర్‌లు ఇతర సైకర్యాలతో పాటు ఆదాయ ప్రయోజనాలను కూడా పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రీమియం చెల్లింపు కాలం ఎంపిక చేసుకునే అవకాశం అందించడం ద్వారా వారి ప్రత్యేక అవసరాలను తీర్చుకోవడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు.

ఓటు ప్రజల ఆయుధం కావాలి

గద్దర్ సంస్మరణ సభలో ఆయన కుమార్తె వెన్నెల

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ప్రజాగాయకులు గద్దర్‌కు నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పాలకుల నిరంకుశత్వం నుండి అన్ని రకాల దోపిడీల నుండి ప్రజలు విముక్తి కావాలంటే నిశ్శబ్దయుద్ధం ప్రజల లక్ష్యంగా వుండాలని, దానికి ప్రజల ఏకైక ఆయుధం ఓటేనని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభలో ఆమే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జ్ఞాన్ రాజ్ పాల్ అధ్యక్షత వహించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ ప్రజల కళ్ళల్లోకి తొంగి చూస్తే ఎవరికైన తన తండ్రి గద్దర్ కనిపిస్తారని వెన్నెల తెలిపారు.ప్రజల బాధలు, ఆవేశాలు, ఆక్రందనలు గద్దర్ పాటలు అయ్యాయని, తన తుది శ్వాస వరకు ప్రజల కోసమే పరి తపించారు అన్నారు. గద్దర్ పిల్లలు ఉన్నతమైన జీవితాలు గడుపుతున్నారు అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారని, తాను తన పదేళ్ల వయస్సులోనే తన తండ్రితో పాటు ప్రజల్లో ఉన్నానని జననాట్యమండలిలో పని చేశానని వెన్నెల తెలిపారు. తన తండ్రి తనను వడిలో పెట్టుకొని తెల్లవార్లూ ప్రజలను చైతన్య పరిచే పాటలు వ్రాస్తూ వుండేవారన్నారు . ఆయన చివరి కోరిక ఒక్కటే నిశ్శబ్ద యుద్ధం ద్వారానే ప్రజల విముక్తికి మార్గం అవుతుంది అని ఆలోచన చేశారని, ఆకలేస్తే అడుక్కుంటే ఆకలి తీరదు పోరాటం ద్వారానే మన ఆకలి తీర్చుకోవాలి అనేది గద్దర్ గట్టిగా విశ్వసించారు తెలిపారు. పోరాటం అంటే సాయుధ పోరాటం ఎంతమాత్రం కాదని ప్రజాస్వామ్య బద్ధంగా మన హక్కులను సాధించు కోవాలి అనేది గద్దర్ ఆలోచన అన్నారు. ఓటు రాజకీయాలతో గద్దెనెక్కిన పాలకులు



గద్దర్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గద్దె చలమయ్య

ప్రజలను కుల , మత, ప్రాంత , వర్గ విభేదాలు సృష్టించి రాక్షస పాలన సాగిస్తున్నారు అన్నారు . ఈ నేపథ్యంలో ప్రజలు తమ విలువైన ఓటును ప్రజా హితం కోరే వారిని గుర్తించి వారికి అధికారం కట్టబెడితే ప్రజాస్వామ్యం ఫరిడిల్లుతుంది అని తన తండ్రి గద్దర్ విశ్వసించారన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ గద్దర్ ఉన్నతమైన విద్యను అభ్యసించి ఏనాడూ ఉద్యోగం చేయాలని తపన పడలేదు అన్నారు. తాడిత, పీడిత ప్రజలకు ఆయన పాటై చైతన్య పరిచేందుకు పాటల శంఖాన్ని పురించాడు అన్నారు. 77 ఏళ్ల స్వాతంత్రం ఏం నేర్పింది అని ప్రశ్నించుకుంటే ప్రశ్నించే వారిని జైల్లో పెట్టటం అక్రమ కేసులు బనాయించటం ఆదాని , అంబానీలకు దొచిపెట్టం కనిపిస్తుంది . గద్దర్ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని తన తుది శ్వాస వరకు రాజీలేని పోరాటం చేశారు అన్నారు .అనంతరం పలువురు నాయలుకులు గద్దర్ గురించి మాట్లాడారు. ముందుకు గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు . ప్రజా కళామండలి బృందం ఆలపించిన గీతాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జి ఆశీర్వాదం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చుక్క చంద్రపాల్ , దావులురి కోటేశ్వరరావు, యార్డు చైర్మన్ పి.బాబురావు, చిలుకా చంద్రశేఖర్ కె.ఎన్.పి.ఎస్ నాయకులు కృష్ణ , సీపీఐ నాయకులుఎన్.వేణుగోపాల్, పీసీసీ కార్యదర్శి వేదాద్రి, ప్రజ కళామండలి నాయకులు వి.నాగేశ్వరావు .జె.పాల్ రాజ్ , జెట్టి శేఖర్ , జి.ఖన్నా తదితరులుపాల్గొన్నారు .

ఫేక్ ఫేస్బుక్ కామెంట్లపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - తెనాలి

ఫేక్ ఫేస్బుక్ అకౌంట్‌తో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంబంధంలేని విషయాలను ఆయనకు ఆపాదిస్తూ పోస్టింగులు పెట్టడాన్ని టిడిపి మైనారిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పట్టణ ఒన్ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ముగ్గురు వైసిపి నేతల మధ్య జరుగుతున్న సంభాషణలను తమ నేత ఆలపాటికి ఆపాదించడం పనికి మాలిన చర్యని మండిపడ్డారు. ముస్లిం సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఆ పోస్టులు ఉన్నాయని, కేవలం దురుద్దేశపూర్వకంగా విషం కక్కుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నాసర్ అహ్మద్, మహ్మద్ ఖుద్దూస్, రహంతుల్లా భేగ్, ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ జరగలేదు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ర్యాగింగ్ జరగలేదని ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ర్యాగింగ్ కలకలం అంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. ఇదే ఘటనపై తాడేపల్లి సిఐ శేషగిరిరావు స్పందించారు. ర్యాంగింగ్ జరిగినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. కేవలం పిల్లల మధ్య మాటామాటా పెరిగిందని, తల్లిదండ్రులు వచ్చి మందలించమని మాత్రమే చెప్పారని వివరణ ఇచ్చారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇరు కుటుంబ సభ్యులు రాజీ చేసుకున్నారని వివరణ ఇచ్చారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తాతిరెడ్డి సూచించారు.

కోతుల బెడదను నివారించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలో కోతుల బెడద నివారించాలని స్థానికులు కోరుతున్నారు. వారానికి ఒకరోజు కోతుల గుంపు ఇళ్లపైకి వచ్చి డాబాలపై ఆరబోసిన వివిధ పదార్థాలను పాడు చేస్తున్నాయని, పైపులు విరగ గొడుతున్నాయని, తాము ఆస్తి నష్టంతో పాటు ఆందోళనకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. శనివారం విజయవాడ క్లబ్ రోడ్డులో ఓ వృద్ధురాలిపై కోతి దాడి చేసి గాయపరిచింది. కోతులను నివారించేందుకు ఎంటిఎంసి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బిఎల్‌ఒలు నిష్పక్షపాతంగా పనిచేయాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి గత ఏడాది ఫిబ్రవరి 6 తేదీ నుండి బూత్ లెవల్ అధికారులు ఏఈఆర్ఓ లు, ప్రత్యేక అధికారులు, మరియు ఈఆర్వోలు తొలగించిన ఓటర్ల లిస్టును పున: పరిశీలించారు. నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలంలోని మునుమాక, విప్పర్లపల్లి, మరియు వడ్లమూడి వారిపాలెం గ్రామాలలో క్షేత్రస్థాయిలో స్వయంగా సంబంధిత ప్రజలను కలిసి వివరాలను సేకరించారు. అనంతరం రొంపిచర్ల మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మ్ 7 పై బిఎల్ఓ మరియు ఏఈఆర్వోలు నిర్వహించిన ఎంక్వయిరీ రిపోర్టును నిశితంగా పరిశీలించారు.



కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి శేషిరెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, మండల రెవెన్యూ అధికారి అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి


జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆ పార్టీ అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ఆర్ నగర్లోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో, అలాగే బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామలింగేశ్వరపేట పుట్ట రాఘవయ్య రైస్ మిల్ వద్ద హరిదాస్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. రూరల్ గ్రామాలు కఠెవరం, అంగలకుదురులో కూడా ఆ పార్టీ నాయకులు పలు రకాల సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరిలో పలు సెంటర్లలో కేక్ కట్ చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతి రావు, టీ కొండలరావుపాల్గొన్నారు.

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట జనసేన పార్టీ ఇంచార్జ్ సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినుకొండ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన బాద్యులు సయ్యద్ జిలాని జనసేన నాయకులు అభిమానుల సమక్షంలో భారీ కేకు కట్ చేసి పంచి పెట్టారు. పలు నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు,పి. బాలాజీ, కటిక అంకారావు, బుర్ర వెంకట అప్పారావు,జీవిఎస్ ప్రసాద్ , ఆనంద్ , ఈశ్వర్,షేక్ అద్రుఫ్, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల :పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని గ్రామాలో జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైనా ముప్పాళ్లలో జనసేన నియోజకవర్గ నాయకులు బోర్రా వెంకటప్పారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు.







అన్నదానం చేస్తున్న మేయర్, తదితరులు

రాజశేఖర్‌రెడ్డి పాలన చిరస్థాయిగా నిలుస్తుంది

- నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

దివంగత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి పాలన తెలుగు ప్రజల మనస్సులో చిరస్తాయిగా నిలిచి ఉంటుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు.శనివారం మేయర్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని 12, 18, 49, 56వ డివిజన్లలో కార్పొరేటర్లు ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు ఖాజా మొహిద్దీన్ చిష్టి, నిమ్మల వెంకటరమణ, బోడపాటి ఉషారాణికిషోర్ కుమార్, అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, సాదు ఉమామహేశ్వరి రాజేష్, గేదెల నాగరంగమని రాజేష్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తూ ప్రభుత్వాల పాలన



మాట్లాడుతున్న సిలార్ మసూద్, అవ్వారు ప్రసాదరావు

'సామూహిక రాయబారం' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

భవన, ఇతర నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చిలకలూరిపేట ఎమ్మెల్యే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల సామూహిక రాయబారం కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి షేక్.సిలార్ మసూద్ పిలుపు నిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోటప్ప కొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో శనివారం పల్నాడు భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు, కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి అడ్డంగా ఉన్న మెమో నెంబర్ 1914 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆయా జిల్లాలో ఉన్న మంత్రుల వద్దకు రాయబారం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న చిలకలూరిపేటలో మంత్రి విడదల రజినిని కలవనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు చిలక లూరిపేట కళా మందిర్ సెంటర్ వద్ద గల భవన నిర్మాణ కార్మికుల అడ్డా నుంచి మంత్రి క్యాంప్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న భవనిర్మాణ కార్మి కులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.



పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-నాదెండ్ల

నాదెండ్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్నటువంటి ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకో వాలి ఆకు కూరలు కూరగాయలు తాజా పండ్లు చిరుధాన్యాలు అందించే పౌష్టి కాహారాన్ని తప్పనిసరిగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని, 10 నుండి 19 సంవత్సరాల కిశోర బాలికలకు రక్తహీనతను నివారించుటకు ఐఎఫ్ఏ టాబ్లెట్లు, పౌష్టికాహారం అవసరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాదెండ్ల పిహెచ్సి వైద్యులు డాక్టర్ ప్రియాంక, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ కె.పద్మ, రాజ్యలక్ష్మి, సింగారెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత పక్వాడ'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణం లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివాం స్వచ్ఛత పక్వడా కార్యక్రమం నిర్వహించినట్లు ఆ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో తల్లి దండ్రులు విద్యార్థులకు ఇంటివద్ద పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందిస్తు వుండాలని వారికి తెలియజేసినట్లు చెప్పారు. పాఠశాలలో కోడిగుడ్డు, చిక్కీరాగి జావ రోజుకో మెనూ అందించడం జరుగుతుందని, విద్యార్థులు వినియోగించుకునేలా విద్యార్థుల తల్లి దండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు.

- సిపిఎం ఆధ్వర్యంలో 'సమరభేరి' కార్యక్రమాలు
- ప్రజావ్యతిరేక పాలనపై నిరసన
- కరపత్రాలు పంపిణీ, అధికారులకు అర్జీలు

ప్రజాశక్తి-వినుకొండ

కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూ అబద్దాలు చెబుతూ పాలన సాగిస్తున్నాయని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన సమర భేరి కార్యక్రమంలో భాగంగా స్థానిక హనుమాన్ నగర్లోని సచివాలయం వద్ద పట్టణ పార్టీ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ విదేశాల్లో ఉన్న నల్ల డబ్బులు రప్పించి ప్రతి పేదవాడి ఖాతాలో 15 లక్షలు జమ చేస్తాం, ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం అంటూ వాగ్దానాలు చేసి పదేళ్లు కావస్తున్న ఏపేదవాడి ఖాతాలో రూపాయి కూడా జమ చేయలేదని, కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని వంద రోజులు అమలు చేసి అన్నారు. దీంతోపాటు పట్టణ పేదలకు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రూప్ 1, 2 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ధికారంలోకి వచ్చే ముందు ధరల స్థిరీకరణకు నిధులు కేటాయిస్తామని నమ్మబలికి రోజురోజుకు ధరలు ఆకాశానంటుతున్న పట్టించుకోవడం లేదని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. చెత్త పనులను రద్దు చేయాలని, ప్రజా కందిపప్పు,నూనె సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య నగర్ కాలనీలో రేషన్ బియ్యం సరఫరా చేయాలనికోరారు. నిరసన అనంతరం సచివాలయం అడ్మిన్ శ్రీనివాసరరావు కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో %ఎ%. తిరుమల లక్ష్మి, ఎస్కె నాసర బి, నాగేంద్రుడు, కరీముల్లా, కె.హనుమంతరెడ్డి సత్యనారాయణ,పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక చెరువు కట్ట బజారులో 14వ సచివాలయం పరిధిలో షేక్ బాజీబీ అడ్మిన్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని, సర్దుబాటు బిల్లు రద్దు చేయాలని



విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పురుగుమందులు సబ్సిడీ ద్వారా సరఫరా చేయాలని, రుణ సౌకర్యాన్ని కల్పించాలని రైతు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు,ఎం.నరసింహారావు పాల్గొన్నారు.

12, 33 వ వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సమరభేరి పట్టణంలో శనివారం నాటికి రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు అద్దు అదుపు లేకుండా పెరిగి పోతున్నాయి అన్నారు. మధ్యతరగతి ప్రజానీకం ధరల కోరల్లో చిక్కుకుపోయి అల్లాడి పోతున్నారన్నారు. దేశంలోని యువత ఉద్యోగాలు, ఉపాధి కరువై నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతున్నారన్నారు. డిగ్రీలు,పీజీలు చదివిన వారు కూలి పనులకు వెళ్తున్నారన్నారు. స్థానిక 33,12వ వార్డులలో పలు సమస్యలు ముఖ్యంగా కరెంట్, తాగునీటి



సత్తెనపల్లిలోని వార్డు సచివాలయంల వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు



సరఫరా తక్కు వసమయం వదులుతున్నారని,కాల్వలు సక్రమంగా తీయడం లేదని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ 30వ వార్డు సెక్రటరీ కిరణ్ కుమార్ కి,12వ వార్డు పవన్ కుమార్లకు అందజేశారు. కార్యక్రమంలో ఎం.విల్సన్., తదితరులు పాల్గొన్నారు.



4న నిరసనలో పాల్గొనండి

ప్రజాశక్తి-అచ్చంపేట

సమరభేరిలో భాగంగా చామర్రి రోడ్డులో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. సమరభేరి ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి గంజిమల రవిబాబు ముందుకు సాగారు. సెప్టెంబర్ 4వ తేదీన అచ్చంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన లో పెద్ద ఎత్తున ప్రజలు తరలిరామంటూ ఆయన పిలుపునిచ్చారు కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు రావెల వెంకటేశ్వర్లు, జి.రవికుమార్ పాల్గొన్నారు

పేదలపై పన్నుల భారం తగదు

ప్రజాశక్తి-క్రోసూరు

ఊటుకూరు సచివాలయంలో ప్రజల సంతకాల సేకరణతో కూడిన అర్జీని సిపిఎం నాయకులు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో



ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా పకోడీలు అమ్ముకొని బతకవచ్చని నిరుద్యోగులను కేంద్ర మంత్రి అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారని అన్నారు. పౌరసరఫరాల ద్వారా అయినా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి పేదలను ఆదుకోకుండా పూర్తిగా కార్పొరేట్ల విధానాలకు రాజీ పడుతూ పేద ప్రజలపై పెద్ద ఎత్తున పన్నులు భారాలు వేయడం తగదని అన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తుంటే అధికార వైసిపి ప్రభుత్వం ఎక్కడా కూడా ప్రశ్నించే ప్రయత్నం చేయకపోగా ప్రతి నిర్ణయాన్ని ఆమోదిస్తోందని అన్నారు. ఈ ఒక్క సంవత్సర కాలంలోనే విద్యుత్ ద్వారా ప్రజల దగ్గర నుండి రూ.4000 కోట్లు ప్రజల నుండి వసూలు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ కమిటీ సభ్యుడు జి.మహేష్, సిహెచ్ కృష్ణ, జి.శాంసోను , జి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పెరిగిన విద్యుత్ ఛార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టణంలోని 1,2,3,19,20,28 వార్డులలో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. అనంతరం 3,20,28 వార్డుల సచివాలయాలలో వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం,పంతంగి ప్రభాకర్, కార్తీక్, సాంబశివ రావు, నాణిక్య నాయక్, గద్దె ఉమాశ్రీ, అనంత వెంకట్ నారాయణ,జడ రాజకుమార్, గడ్డం సుసులో, అనుముల కుమారి,హైమావతి,పార్వతి, సాయిబాబా, షేక్ సైదులు, వనమా రామారావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడులో సిపిఎం మండల శాఖ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్తు చార్జీలకు, మండుతున్న సరుకుల రేట్లకు వ్యతిరేకంగా గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. వర్షాలు లేక పంటలు పండక గ్రామీణ ప్రజల పరిస్థితి దుర్భరంగా మారిందని రైతులకు ప్రధాన ఆదాయ వనరు అయిన పాడి పరిశ్రమ కూడా పశు గ్రాసం దొరక్క అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కరువు పరిస్థితులు ఉన్నందున వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండారుపల్లి నాగేశ్వరరావు, గాదంశెట్టి నాసరయ్య పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం సమరభేరి

4న సచివాలయాల వద్ద ఆందోళనలు జయప్రదం చేయండి


గ్యాస్‌ధర తగ్గింపు ఎన్నికల జిమ్మిక్కు


వట్టిచెరుకూరు ప్రచారభేరీలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - వట్టిచెరుకూరు :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమా లలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు.శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరి ప్రజా సమస్యలపై ప్రచార క్యాంపన్లో భాగంగా వట్టిచెరుకూరు, అనంతవరపాడు, లేమల్లేపాడు, చమళ్ళమూడి, కాట్రపాడు, వింజనంపాడు, ఏటుకూరు, లలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెంచాని, అలాగే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు పోగొట్టి నిరుద్యోగాన్ని పెంచాలని అన్నారు. బిజెపి అధికారంలోకి రాకముందు 400 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1150కు పెంచి ఇప్పుడు ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూ.200 రూపాయలు తగ్గించినట్టుగా ఫోజు పెడుతున్నారని, ఎన్నికల అనంతరం మళ్లీ గ్యాస్ ధరలు పెంచుతారని అన్నారు. విద్యుత్ చట్ట సవరణ చేసి ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు విద్యుత్ ఎగనామం పెట్టబోతున్నారని తెలియజేశారు. కార్య క్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి లక్ష్మణరావు, నాయకులు యం.కిరణ్, సమీర్, నరసింహ, బ్రహ్మం పాల్గొన్నారు.


వట్టిచెరుకూరులో సిపిఎం భేరీ ప్రచారంలో మాట్లాడుతున్న పాశం రామారావు


మంగళగిరి మండలంలో వినతి పత్రం ఇస్తున్న ఈమని అప్పారావు, కోటేశ్వరి తదితరులు



మేడికొండూరులో వినతి


మంగళగిరిలో వినతి


కొలనుకొండలో వినతి


సుందరయ్య నగర్‌లో నిరసన


తెనాలిలో ప్రచారం


పొన్నూరులో వినతి

వార్డు సచివాలయాల వద్ద సిపిఎం నిరసన

ప్రజాశక్తి-గుంటూరు :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా, అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని స్థానిక 41వ వార్డు సచివాలయం వద్ద పుచ్చలపల్లి సుందరయ్య నగర్ సిపియం శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు షేక్.ఖాసిం షహీద్, ఆది నికల్సన్, షేక్.మస్తాన్‌వలి, కె.ఆంజనేయులు, జి.లూదర్‌పాల్, ఎండి ముస్తాక్ పాల్గొన్నారు. పాతగుంటూరులో 12, 13 సచివాలయాల ఎదుట సిపియం ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమలంలో పార్టీ నాయకులు ఎల్.అరుణ, చింతల శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, ఎం.కృష్ణకుమారి పాల్గొన్నారు. తూర్పు నియోజక వర్గం పరిధిలోని పరమాయకుంట, శారదా కాలనీ, వసంతరాయపురం, రామిరెడ్డి తోట, గుంటూరు వారితోట, రెడ్డిపాలెం సచివాలయాల్లో వినతిపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, నెహ్రూ నగర్ శాఖ కార్యదర్శి టి.రాధ, డొంకరోడ్డు శాఖ కార్యదర్శి జి.శంకర్రావు, నక్కా మస్తాన్, కోలా వాసు, పి.దీవెనరావు పాల్గొన్నారు. స్థానిక గుజ్జనగుండ్ల సిపియం శాఖ ఆధ్వర్యంలో తుపాన్ నగర్, నాయిబ్రాహ్మణ కాలనీ, కళ్యాణి నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో షేక్.బాషా, శాఖ కార్యదర్శి ఖాసింవలి, పటాన్ సుబాని, షేక్.బాషు, సయ్యద్ మౌలాలి, ప్రసాద్ పాల్గొన్నారు. నేతాజి నగర్‌లో స్థానిక ప్రజలతో కలిసి సమర భేరి పోస్టర్ ఆవిష్కరించి, అనంతరం సచివాలయంలో అధికారులకు వినతిపత్రం అందచేశారు.

అనధికార కోతలతో అల్లాడుతున్నాం

ప్రజాశక్తి-తెనాలి :ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలపై సిపిఎం చేపట్టిన సమరభేరిలో భాగంగా శనివారం సుల్తానాబాబు, సుంద రయ్య నగర్ కాలనీలో పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పర్యటించారు. విద్యుత్ బిల్లుల పెంపు, అనధికార విధ్యుత్ కోతలపై ప్రజలు నాయకుల వద్ద ఏకరువు పెట్టారు. దోమల తీవ్రత, పాములు, ఇతర జలచరాలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, పట్టణ కార్యదర్శి కె బాబు ప్రసాద్ మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆందోళనల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో, శెట్టి ఏసోబు, రాములు, శాంతమ్మ, నాగేశ్వం రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సచివాలయాల్లో వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : సిపిఎం ఆధ్వర్యంలో చిన్నకాకాని లో సమరభేరి ప్రచారం నిర్వహించి సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం మంగళగిరి మండల నాయకులు వత్రం పూర్ణయ్య, టి. బ్రహ్మయ్య, సుబ్బారావు, వంశీ పాల్గొన్నారు.నిడమర్రు గ్రామ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. బాబూజీ నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, నాయకులు జి నాగేశ్వరరావు ఎం అంకమ్మరావు కే వీరయ్య పాల్గొన్నారు. కాజలో పంచాయతీ కార్యాదర్శి ఎం రమేష్‌కు నాయకులు ఈమని అప్పారావు, బి కోటేశ్వరి, కె గోపాల్ రెడ్డి, ఎస్ సుమ తదితరులు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, స్థానిక సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి, కొలనుకొండ, వడ్డేశ్వరం, ప్రాతూరు, గుండి మెడ, చిర్రావూరు గ్రామల సచివాలయాలలో సిపిఎం శ్రేణులు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలో ఇళ్ల స్థలాల సమస్య ప్రధానంగా ఉందని, కుంచనపల్లి, వడ్డేశ్వరం, కొలనుకొండ, గ్రామాలలో పోరంబోకు, కొండ పోరంబోకు స్థలాలలో, పిడబ్ల్యూడి స్థలాలలో ఇల్లు వేసుకున్న పేదలకు రెగ్యులర్ చేసి, పట్టాలు ఇవ్వాలని అన్నారు. చిర్రావూరు గ్రామంలో పాడి పశువులు అధికంగా ఉన్నాయని, పశువుల హాస్పిటల్‌ను పూర్తి చేసి తక్షణమే పశు వైద్యులను నియమించాలన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతు ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలువను రిపేరు చేసి రైతుల పంట పొలాలకు సాగునీరివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రామారావు, కాట్రగడ్డ శివన్నారాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు, పల్లె కృష్ణ, బత్తుల సంసోను, ఎస్.కె గన్ రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి పట్నంలోని రెండవ సచివాలయంలో విద్యుత్ చార్జీలు తగ్గించా లని, ఇళ్ల పట్టాలి ఇవ్వాలని, చెత్త పన్ను ఎత్తివేయాలని కోరుతూ వినతిపత్రం అంద జేయడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం నాయకులు ఎస్ వెంకటేష్, ఎస్ గణేష్, ఎస్ బాలాజీ, ఎస్ దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సచివాలయాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు అర్జీలు అందజేశారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ రెండు సచివాలయాల్లో, ఉండవల్లి సెంటర్, నులకపేట, ప్రకాష్‌నగర్, బ్రహ్మానందపు రం సచివాలయాల్లో అర్జీలు అందజేశారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పొన్నూరులో ప్రచార భేరీలోలో భాగంగా మూడో సచివాలయ ఇన్చార్జికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ సహాయ కార్యదర్శి ఎం రమేష్ బాబుపాల్గొన్నారు.

ప్రజాశక్తి -మేడికొండూరు :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరిలో భాగంగా మేడికొండూరు ,పేరేచర్ల, ఎలవర్తిపాడు, గ్రామలలో సమస్యలపై సంతకాలు సేకరించి సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొట్ల రామకృష్ణ, సిపిఎం నాయకులు బి శ్రీనివాసరావు, ఎస్ఎం భాషా, జుబీర్, అదంషఫి తదితరులు పాల్గొన్నారు.




. ఇళ్లసమస్యను పరిష్కరించాలని వినతి


ప్రజాశక్తి-పెదకాకాని రూరల్ :సుందరయ్య కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్ శివాజి డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో 310 కుటుంబాల పేదలు 2007 ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారన్నారు. కనీస వసతులు లేవని, మెయిన్ రోడ్డు ఒకటి మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. 12 అడ్డరోడ్లు నిర్మాణం జరగలేదని, రోడ్లు మొత్తం గుంతలు పడి వృద్దులు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివాస ముంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణ పూరి కాలనీ, శ్రీ లక్ష్మి దుర్గ శివ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తదితర కాలనీలలో నివా సం ఉంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని సోమవారం ఉదయం 10 గంటలకు తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పేద ప్రజలందరూ పాల్గొనాలని పిలు పిచ్చారు. కార్యక్రమంలో చెన్నైం రామకృష్ణ, జి శ్రీనివాస్, ప్రసన్న రాజు పాల్గొన్నారు.

రైలు గేటు సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-తెనాలి :రైతుల సౌకర్యార్థం మూసివేసిన రైలు గేటు తెరిపించాలని కోరుతూ శనివారం సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. తెనాలి-రేపల్లె రైలు మార్గంలో జంపని-చినరావూరు రైలు గేటు మూసివేత దాదాపు 8 గ్రామాల రైతుల తీవ్ర ఇవ్వందులను ఎదుర్కొంటున్నారని, తక్షణమే రైలు గేటు తెరిపించాలని కోరుతూ రైలు గేటు సాధన కమిటీ ఆధ్వర్యంలో జగ్గడిగుంటపాలెం, పెదరావూరు సచివాలయాల్లో వినతిపత్రాలు పమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మట్లాడుతూ గతంలో రైల్వే శాఖకు కూడా రైలు గేటు తెరిపించాలని వినతి పత్రాలు సమర్పించామన్నారు. ఇప్పటికైనా రైతుల అవసరం, ఇబ్బంది గుర్తించి రైల్వే అధికారులు రైలు గేటు తెరిచేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. ఈమేరకు జగ్గడిగుంటపాలెం సర్పంచ్, కార్యదర్శి కుంభం బాలాజి, జి.స్వరూపరాణి, పెదరావూరు కార్యదర్శి కె.సుబ్బారావుకు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు కార్యక్రమంలో రైలుగేటు సాధన కమిటీ సభ్యులు, రైతులు కుర్రా వెంకటరమణ, బొంతా సాంబశివరావు, పి.వెంకటేశ్వర్లు, ఆదిన గోపి, సురేష్ పాల్గొన్నారు




ప్రకాష్‌నగర్‌లో వినతి


చినకాకానిలో వినతి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలోని 69 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని పంపిణీ చేశారు. స్థానిక ఎన్నార్టీ సెంటర్లో గల తన కార్యాలయంలో శనివారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.53 లక్షల 25 వేలు విలువ చేసే చెక్కులను అందచేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం పట్టణములో పలు సెంటర్లలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చెక్కులు మంజూరైన వారికి పురుషోత్తమ పట్నం 30 వ వార్డుకి చెందిన షేక్ కరిమియాకు రూ.5 లక్ష లు, పండరీపురం 36వ వార్డుకి చెందిన బత్తు ల సుబ్బారావు కి రూ.3 లక్షల 75 వేలు, సుబ్బయ్యతోట కి చెందిన షేక్ అన్సారీ హుస్సేన్ కి రూ.3 లక్షలు, యడ్లపాడు మండలం సొలసకి చెందిన బొక్క శ్యాంప్రసాద్ కి రూ.1 లక్ష 40 వేలు, నాదెండ్ల మండలం అప్పాపురానికి చెందిన నాయుడు పుష్పవతి కి 1 లక్ష 20 వేల రూపాయల చెక్కు లను పంపిణీ చేశారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి విడదల రజిని



నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి గవర్నమెంట్ హాస్పిటల్లో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఐ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ నేత్ర విధానం కార్యక్రమాన్ని మొదలు మొదలుపెట్టారు.ఆప్తమాలజిస్ట్ అరుణ కుమారి మాట్లాడుతూ మనిషి మరణాంతరం 6 గంటల్లోపు కంటిని దానం చేయవచ్చని, తద్వారా అంధత్వంల ఉన్న ఒకరికి కంటి చూపు ప్రసాదించవచ్చని తెలియజేశారు. ఆసక్తి కలవారు ఈ నెల 8వ తారీకు లోపు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

హాస్పటల్ సూపర్డెంట్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ కంటి చూపు లేని వారికి కంటిచూపు ప్రసాదించటం అన్ని దానాలలో కల్ల గొప్పదనం అని తెలియజేశారు.అదేవిధంగా హాస్పటల్ అభివద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకష్ణ మొదటిగా సంతకం చేసి డొనేట్ చేయడానికి ముందుకు వచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ఈ నేత్రదానంలో పాల్గొని కంటి చూపు లేనివారికి కంటిచూపు ప్రసాదించే ఒక గొప్ప కార్యక్రమం ని ఇలాంటి కార్యక్రమం హాస్పిటల్లో నిర్వహించడాన్ని కొనియాడారు. హాస్పటల్ లో పనిచేస్తున్న 15 మంది డాక్టర్లు మరియు స్టాప్ మొదటిగా డొనేట్ చేయడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ సూపర్డెంట్ లక్ష్మణరావు, ఆర్ ఎం ఓ శోభారాణి, నర్సింగ్ సూపర్డెంట్ రాధ, ఏవో భవాని, మెడికల్ సూపర్వైజర్ విజయలక్ష్మి, కంటి డాక్టర్ అరుణ కుమారి, అడ్మినిస్ట్రేటర్ సురేష్ పాల్గొన్నారు.

ఒక్కరికి ఒక్క ఓటే ఉండాలి

ప్రజాశక్తి -రెంటచింతల

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఒక్క ఓటే ఉండాలని, ఓటర్ల నమోదు తొలగింపు నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల స్పెషల్ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి ఓటర్లను కోరారు. శనివారం మండల కేంద్రమైన రెంటచింతలలోనే రైలు పేటలో ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదులో ఏమైనా పొరపాట్లు జరిగాయా, వేరు డోర్ నెంబర్ల పై రెండు ఓట్లు ఉన్నాయా అనే దానిపై విచారణ చేశారు. అలాగే 234,235, 236,237 పోలింగ్ బూతులను పరిశీలించారు రహదారి,విద్యుత్ సౌకర్యం, గాలి వెలుతురు తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రెంటచింతల మండలంలో ఇప్పటివరకు డబల్ ఎంట్రీ ఓట్లు 683 ను తొలగించినట్లు పేర్కొన్నారు. శనివారం నాటికి ఓటర్ల సంఖ్య 40,584 మంది ఉన్నారని, అందులో పురుషులు 19621 కాగా మహిళా ఓటర్లు 20 వేల 960 జండర్ 3 మంది ఉన్నారని ఆయన తెలిపారు ఆయన వెంట తాసిల్దార్ కే పుల్లారావు, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ భాష, ఆర్ఐ కాంతారావు, బిఎల్వోలు పాల్గొన్నారు



రెంటచింతలలో వివరాలు అడుగుతున్న ఎన్నికల స్పెషల్ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

మాజీ ప్రధాని పివి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన


ప్రజాశక్తి- సత్తెనపల్లి

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో భూమిపూజా కార్యక్రమం జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు మాజీ శాసన సభ్యులు వెంకటేశ్వర రెడ్డి పలువురు పట్టణ నాయకులు ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దూరవిద్య ఏ. సి. డి. సి. కే యమ్.డి హుస్సేన్ మరియు ఏఐ కోఆర్డినేటర్ లు కెవి సుబ్బారెడ్డి, యు వెంకటేశ్వరరావు, పి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీడీసీ హుస్సేన్ మాట్లాడుతూ 'చదువు మళ్ళీ కొన సాగిద్దాం .. బంగారు భవిష్యత్తు నిర్మించుకుందాం' అని అన్నారు.10వ తరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకున్న వారు 14 సంవత్సరాలు నిండిన అందరూ అర్హులే బడి మధ్యలో మానేసిన వారికి మరియు 10వ తరగతి ఫెయిల్ అయ్యి 14 సంవత్సరాలు నిండిన వారికి పదవ తరగతి చదువుకునే సువర్ణ అవకాశం. మహిళలకు, పలు వత్తి వ్యాపార రంగాలలో ఉన్న వారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు మరియు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఒక సదవకాశం సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడుతాయి అని అన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ కూడా కొన్ని అర్హతలు కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులు చదవడం వల్ల విద్యార్థిని విద్యార్థులకు కొన్ని వెసులుబాట్లు సౌకర్యాలు కూడా కలిగి ఉన్నారు. తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపల్స్, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది గ్రామ సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలసి సంయుక్తంగా ఓపెన్ స్కూల్లోని 10 వ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సుల్లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు అన్నారు.



'బాబు ష్యూరిటి- భవిష్యత్తుకు గ్యారెంటి'

ప్రజాశక్తి-బెల్లంకొండ

'బాబు ష్యూరిటి- భవిష్యత్తుకు గ్యారెంటి' కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలాపాటి శ్రీధర్ బాబు బెల్లంకొండలో శనివారం ప్రారంభించారు. మహిళ, రైతు, యువత, వెనుకబడిన తరగతుల సాధికారత, బలోపేతంతోపాటు ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పేదలను ధనికులుగా తీర్చిదిద్దడానికి తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన తొలి ఏజెండా 'భవిష్యత్తు గ్యారెంటీ" మ్యానిఫెస్టో గురించి ప్రజలకు తెలియజేసేందుకు, ప్రజలను చైతన్యవంతం చేసి, 2024లో టిడిపి అధికారంలోకి వచ్చాక 'భవిష్యత్తుకు గ్యారెంటీ' లోని వాగ్దానాలను ఎటువంటి వివక్ష లేకుండా, నిబంధనలు విధించకుండా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నమోదు చేయించి, గ్యారెంటీ కార్డును ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నల్ల మేకల లక్ష్మీనారాయణ మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు మండల బీసీల అధ్యక్షులు గంగారావు, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు, ఉపాధ్యాయుల పనితీరుపై విద్యాశాఖ కార్యదర్శి ఆగ్రహం

ప్రజాశక్తి-వినుకొండ

ఎంఇఒలు, ఉపాధ్యాయుల పనితీరుపై రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వినుకొండ పట్టణంలో పర్యటించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర హైస్కూల్లో తనిఖీలు నిర్వ హించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 మంది విద్యార్థులకు 20 మంది అధ్యాపకులు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. బాలుర హైస్కూల్లో ఉపాధ్యాయుల కొరత ఉండగా కాలేజీ అధ్యాపకులను ఎందుకు అడ్జస్ట్మెంట్ చేయలేదని ఆర్జెడి వి.ఎస్ సుబ్బారావు, డీఈఓ శామ్యూల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుర హైస్కూల్లో తనిఖీలు నిర్వహించిన ఆయన విద్యార్థులు కింద కూర్చొని అభ్యసించడానికి గుర్తించి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వ శిక్ష అభియాన్ డి ఈ ఈ విజయ్ కుమార్ పై ఆగ్రహించారు. పిల్లలు కింద కూర్చోవడానికి వీల్లేదని బాలల అవసరమైన పాఠశాలను గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠ్యాం శాలపై చర్చించారు. విధులు సక్రమంగా నిర్వ హించని ఎంఈఓ లపై చర్యలు తీసుకోవాలని డీఈవో శామ్యూల్ ను ఆదేశించారు. అనంతరం వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి పాఠశాలను,వినుకొండ మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సచివాలయాన్ని సందర్శించి వెల్ఫేర్ అసిస్టెంట్ల, వాలంటీర్లతో మాట్లాడారు. తెలంగాణలో ఉన్న విద్యార్థులను లిస్టులోనించి (మైగ్రేషన్) తొలగించకుండా ఎందుకు ఉంచారని నిలదీశారు. కలెక్టర్‌తో ఆయన ఫోన్లో చర్చించారు. సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





పెదమద్దూరు హై లెవెల్ బ్రిడ్జి పనుల పరిశీలన


ప్రజాశక్తి -అమరావతి

అమరావతి- తుళ్లూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండల పరిధిలోని పెద్దమద్దూరు గ్రామం వద్ద 44 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న పెద్దముద్దూరు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు. శంకరరావు పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం నాలుగు పిల్లర్లు పనులు పూర్తిగా గాక ఐదో పిల్లర్ పనులు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని సంబంధితఅధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

'రైతులను నిట్టనిలువునా ముంచుతున్నారు'

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అలవి గాని హామీలతోని అధికారంలోకి వచ్చిన ఈ సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఈరోజు రాష్ట్ర రైతాంగాన్ని నిట్ట నిలువునా కరెంటు కోతలతో ముంచేసి తీవ్ర నష్టానికి గురి చేశారని గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 9 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తానని చెప్పి రైతులకు హామీ ఇచ్చి, ఈరోజు పల్లెల్లో, పట్టణాల్లో కరెంటు కోతలు విధించి, పంట నష్టం జరిగి పూర్తిగా రైతులు నట్టేటా మునిగే పరిస్థితి కల్పించింది ఈ వైసీపీ ప్రభుత్వం అని అన్నారు. అదేవిధంగా రాత్రి కరెంటు కోతలు విధించడం వల్ల పట్టణాల్లో, పల్లెల్లో ప్రజలు తీవ్రమైన దోమల బెడదతో కూడా ఇబ్బందులు పడుతున్నారు. అందినకాడికి దోచుకోవడం, అనుభవం లేని పరిపాలన తోని ఆంధ్ర రాష్ట్రాన్ని నట్టేట ముంచింది జగన్ ప్రభుత్వం, జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు .



రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రైతులకు రుణాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పిఎసిఎస్ లో శనివారం సొసైటీ ఆవరణలో 26 మంది రైతులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఆప్కో చైర్మన్ చిరంజీవి, సొసైటీ చైర్ పర్సన్ ఏ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 38 వాలంటీర్ల పోస్టులు ఉన్నాయని వాటికి దరఖాస్తు చేసు కోవాలని నిరుద్యోగ యువతీ యువకులకు కార్పొరేషన్ కమిషనర్ యు.శారదా దేవి శనివారం తెలిపారు. దర ఖాస్తులు ఈనెల మూడో తేదీ నుండి ఆరో తేదీ వరకు చేసు కోవచ్చని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన 7, 8 తేదీల్లో జరుగుతాయని , మౌఖిక పరీక్ష 12, 13 తేదీల్లో జరుగుతాయని తెలిపారు. ఎంపి కైన వివరాలను 15వ తేదీన తెలియజేస్తారని పేర్కొన్నారు.

ట్యాబ్ లు నూరు శాతం ఉపయోగించాలి

ఉపవిద్యాధికారిని ఎం.నిర్మల

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన ట్యాబ్లు నూరు శాతం వినియోగంలో ఉండాలని ఉపవిద్యాధికారిని ఎం.నిర్మల అన్నారు. స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో రెక్టిఫికేషన్ ఆఫ్ ఎర్రర్స్ అండ్ బైజూస్ టాబ్స్ కి సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వ హించారు. గత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువు తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్ తో కూడిన టాబ్స్ అందించిన సంగతి తెలిసిందే. అయితే వాటి నిర్వహణ, మరమ్మతులకు సం బంధించి సిఎస్ఈ ఆదేశాల ప్రకారం స్పెషల్ డ్రైవ్ నిర్వ హించి టాబ్స్ సమస్యలు ఉన్న పాఠశాల ప్రధానో పాధ్యాయులు, టెక్నికల్ నాలెడ్జ్ కలిగిన ఒక యాక్టివ్ టీచర్ హాజరై క్యూఆర్ కోడ్స్, స్కానర్స్, ఎస్డీ కార్డుతో పాటు విద్యార్థుల ఆధార్ ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ తో యాక్టివేట్ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని పర్య వేక్షించిన ఉప విద్యాధికారిణి మాట్లాడుతూ విద్యా ర్థులకు అందించిన ట్యాబ్లు నూరు శాతం వినియోగంలో ఉండాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలు ఉంటా యన్నారు. అదేవిధంగా ఫిజికల్ డామేజ్ కలిగిన ట్యాబ్స్ దగ్గరలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్స్ కి అప్పగించి పనితీరు మెరుగుపరుచుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం 9వ తరగతి, అలాగే రాబోయే సంవత్సరం సీబీఎస్ఈ పద్ధతిలో పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు హాజ రయ్యే విధంగా బైజుస్ ప్రీమియం కంటెంట్ ఉంటుందన్నారు. డిజిటల్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని, ఉపాధ్యాయులు ఆ విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు.. బత్తుల అంకమ్మరావు నిర్వహణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఉపాధ్యాయులకు, సచివాలయం డిజటల్ అసిస్టెంట్ స్ కు అవగాహన కల్పించడం జరిగిందని తెనాలి ఉప విద్యాశాఖ అధికారిణి చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు డాక్టర్ ఎం. లక్ష్మీ నారాయణ, వి.జయంతి బాబు, జి. లలిత ప్రసాద్, తెనాలి డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి ప్రశాంతి పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న ఉపాధ్యాయులు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న నెహ్రూ నికేతన్‌లో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీ కాంత్ దాసరి పర్యవేక్షణలో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్‌కు సంబంధించి వివిధ పాఠ్యాంశాలపై తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఎగ్జి బిషన్‌ను తిలకించారు. ప్రతి అంశంపై విద్యార్థులు చక్కగా వివరించి, సందర్శకులను ఆకట్టు కున్నారు. కార్య క్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉపకార వేతనాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మంగళగిరి

శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 40వార్షికోత్సవ సందర్భంగా చేనేత పేద విద్యార్థుల ఉపకార వేతనం లకు దరఖాస్తులు ఆదివారం నుండి షరాఫ్ బజార్ల గల మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వనున్నట్లు సొసైటీ సెక్రటరీ పి.రాజశేఖర్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోపు అసో సియే షన్ కార్యా లయంలో అందజేయాలని, అర్హులైన వారికి అక్టోబర్ 1వ తేదీన ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు చెప్పారు.



చిత్రలేఖనంపై అవగాహన

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

కేఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షనల్ యాక్టివిటీస్ (సిఇఎ) ఆధ్వర్యంలో స్థానిక మంగళగిరి లోని డాన్ బాస్కో హై స్కూల్ నందు 7,8, 9 తరగతుల విద్యా ర్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం పట్ల అవగాహన కల్పించారు. వివిధ రకాల రంగులను అద్దటం మరియు పెన్సిల్ ఆర్ట్ మొదలగు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనం తరం 8, 9 తరగతుల బాలికలకు యుక్త వయసులో రుతుక్రమంలో వచ్చే మార్పులపై అవగాహనతోపాటు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు విద్యార్థి విభా గపు అధికారి చప్పిడి హనుమంతరావు అందజేశారు. బాలి కలు యుక్త వయసులో వచ్చే మార్పులు శారీరక, మానసిక మార్పులపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సాక్ డైరెక్టర్ సాయి విజయ్ తెలిపారు. యుక్త వయసులో ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలని పలు సూచనలు తెలియజేశారు. నెలసరి సమయంలో సరైన పద్ధతులు పాటించకపోతే చర్మ వ్యాధులు వస్తాయని సీఈఏ ప్రొఫెసర్ ఇంచార్జ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఈ కార్యక్రమానికి సి.ఈ.ఏ. కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సమన్వయ కర్తగా వ్యవహరించారు.సి.ఈ.ఏ. వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు గాను వైస్ చాన్సులర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో" వైస్ ఛాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ , డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్. సుబ్బారావు అభినందించారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి



గుంటూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు గుంటూరులో శనివారం ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు నివాళి అర్పించారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువై అభివద్ధిని ఆచరణలో అమలు చేసి చూపించిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని పలువురు నాయకులు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయం, ఎమ్మెల్యే ముస్తాఫా కార్యా లయంలో వేర్వేరుగా వర్ధంతి సభలు జరిగాయి. ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సభకు పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అధ్యక్షతన వైఎస్సార్ వర్ధంతి సభ జరిగింది. ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి, ముస్తాఫా, మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైసిపి నాయకులు డాక్టర్ షేక్, నూరిఫాతిమా తదితరులు పాల్గొన్నారు. **తెనాలి:** స్థానిక రణరంగ చౌక్‌లోని వైఎస్సార్ విగ్రహానికి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో నివాళులర్పించారు. కార్య క్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం పాల్గొన్నారు. స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు అధ్యక్షతన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. **మంగళగిరి:** కొత్త బస్టాండ్ సెంటర్లోని వైయస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు నివాళు లర్పించారు.' ట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **తాడేపల్లి:** కొత్తూరులోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల లు వేసి నివాళులర్పించారు. అ ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, ఎం.వెంకట రామిరెడ్డి, సిహెచ్ దుర్గారావు, ఎం.వివేకానందరెడ్డి, ఎం.వెంకటేశ్వర రావు, ఎస్.పార్వతి, ఎం.ప్రకాష్, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపిపి వేమారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నివాళులర్పించారు.

సంక్షేమ పథకాల శ్రామికుడు వైయస్సార్

ప్రజాశక్తి-సత్తెనపలి/సత్తెనపల్లి టౌన్ : సంక్షేమ పథకాల సృష్టికర్త, ఆరోగ్య శ్రీ ఆవిష్కర్త వై ఎస్ రాజశేఖర్ రెడ్డి నిరంతర శ్రామికుడని రాష్ట్రజల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు కొని యాడారు. వైసిపి కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తాలూకా సెంటర్ , గ్రంథాలయ వద్దవున్న వైయస్సార్ విగ్రహాలను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతోపాటు మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర్ రెడ్డి, పక్కాల సూరిబాబులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు వెలుగూరి శరత్ కలాం కలాంచేయూత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి పురస్కరించుకొని 24వ విడత కలాం చేయూత కార్యక్రమంలో భాగంగా ఆరవ వార్డుకు చెందిన గౌస్యా కి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో రూ. 12 వేల విలువైన బల్ల బండిని అందించారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లో వైయస్సార్ విగ్రహం వద్ద అల్పాహారంగా పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. **కారంపూడి:** మండలం లోని కారంపూడి, ఒప్పిచర్ల గ్రామాల్లో వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. **పల్నాడు జిల్లా:** ప్రకాష్ నగర్ లోని వైసిపి కార్యాలయంలో,రిక్షా సెంటర్,రెడ్డి నగర్, బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, 31వ వార్డ్, 26వ వార్డు ఇందిరా గాంధీ విగ్రహం వద్ద, రామిరెడ్డి పేటలోని పాత సమితి ఆఫీస్, కేర్ పబ్లిక్ స్కూల్ వద్ద, షాలెం నగర్, 60 అడుగులు రోడ్డులో తదితర ప్రాంతాలలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళు లర్పించారు. ఆయా విగ్రహాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **విజయపురిసౌత్:** మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు,మాజీ జడ్పీటిసి శేరెడ్డి గోపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. విజయపురిసౌత్ లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. **అమరావతి:** రాష్ట్ర వైసీపీ నాయకులు నిమ్మా విజయ సాగర్ బాబు ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యా లయంలో వైయస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయ సాగర్ బాబు మాట్లాడారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, పెద్దమద్దూరులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ధరణికోట గ్రామపంచాయతి కార్యాలయంలో సర్పంచ్ మాదాసు పావని రాంబాబు, ఎండ్రాయిలో, ఉంగుటూరులో, మండే పూడిలో, మల్లాదిలో, జూపూడిలో , అత్తలూరులో, మునుగోడు సహా పలు గ్రామాలలో వైఎస్ఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సత్తెనపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

డిగ్రీ విద్యార్థులకు 5,6 సెమిస్టర్‌లకు సప్లిమెంటరీ పరిక్షలను నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి రెడ్డి ప్రకాష్‌కు సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎం కిరణ్ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో 2020-23 సంవత్సరం విద్యార్థులకు మెగా సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. సప్లమెంటరీ పరీక్షలు లేకపోవడం వల్ల 5,6 సెమిస్టర్ లో ఒకటి రెండు సబ్జెక్టులు ఆగిన విద్యార్థులు పై చదువులకు వెళ్లేందుకు, ఉద్యోగాలు పొందేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. డిగ్రీ విద్యార్థులకు సప్లమెంటరీ నిర్వహిస్తే ఎక్కువ మంది విద్యార్థులు పాస్ అయ్యి బయటకు వచ్చే పరిస్థితి ఉంటుందని, కావున అధికారులు వెంటనే స్పందించి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే సమీర్ , జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.


పరీక్షల నిర్వహణాధికారికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చలపతి ఫార్మసీ ప్రిన్సిపల్‌కు ప్రత్యేక ప్రశంసా పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ఫార్మసీ వత్తిలో అత్యుత్తమ సేవ లందించినందుకు అసోసియేషన్ అఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ అఫ్ ఇండియా (ఎ.పి.టి.ఐ) లాంలోని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాదెండ్ల రామారావుకు ప్రత్యేక ప్రశంస పురస్కారాన్ని బహుకరించింది. రామారావుకు శనివారం ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ లో పి.ఎస్.ఐ.టి. విశ్వ విద్యాలయంలో జరిగిన ఎపిటిఐసిఒఎన్- 2023 జాతీయ సదస్సులో పిసిఐ అధ్యక్షుడు డాక్టర్ మోంటుకుమార్ పటేల్, ఎపిటిఐ ప్రెసిడెంట్ డాక్టర్ మిలింద్ ఉమేకర్, ఎపిటిఐసిఒఎన్, ఎల్ఒసి చైర్మన్ డాక్టర్ దీపేందర్ సింగ్ తదితరుల చేతుమీదుగా సత్కరించి, పురస్కారం అందచేశారు. రామారావు ఫార్మసీ విద్య, పరిశోధనారంగంలో 32 ఏళ్ల అనుభం కలిగి, 200కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. 7 పుస్తకాలను రచించి 3 పేటెంట్‌లు పొందారు. ఫార్మసీ కౌన్సిల్ అఫ్ ఇండియా సభ్యుడిగా నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలు చేశారు. పరిశోధనకు పెద్ద పీట వేస్తూ 32 మంది డాక్టరేట్ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. 100కు పైగా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు.గతంలో ప్రొఫెసర్ యమ్.యల్. ఖోరానా మెమోరియల్ అవార్డు, స్కోర్ మోర్ ఫౌండేషన్ వారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, హార్ట్ ఫుల్ ప్రొఫెసర్ అవార్డు, సన్ ప్యూర్ రీసెర్చ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం, చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందనలు తెలిపారు.





మాట్లాడుతున్న జెసి రాజకుమారి

'ఆడుదాం ఆంధ్ర' నిర్వహణపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అక్టోబర్ 2వ తేదీ నుండి నుండి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర ఆటలకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి శనివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద గల పరీక్షా భవన్‌లో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ ఈ పోటీల నిర్వహణలో పాటించాల్సిన విధి విధానాలు వివరించారు. విద్యాశాఖ అధికారులు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేసి, విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, స్టెప్ సిఇఒ ఎస్.పల్లవి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్లం కాలేజి అధ్యాపకునికి స్వర్ణ పతకం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజి నీరింగ్ కాలేజి అధ్యాపకులు , ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ పి.ఎల్.మాధవరావు ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ నుండి ఉత్తమ రీసెర్చ్ పిహెచ్‌డి డిగ్రీ వ్యాస గ్రంథం సమ ర్పించి, ఇటీవల జరి గిన వర్సిటీ 39వ స్నాత కోత్సవంలో స్వర్ణపతకం పొందారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య రాజశేఖర్ చేతుమీదుగా పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవరావును కాలేజి చైర్మన్ కళ్లం మోహనరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎ.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి అభినందనలు తెలిపారు.



స్వర్ణపతకం అందుకుంటున్న మాధవరావు

ప్రజా ప్రతినిధుల స్పందన కరువు



ఉమ్మడి గుంటూరు జిల్లాను కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు, రైతులకు తగిన భరోసా కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు ఇంతవరకు దృష్టి సారించలేదు. ప్రధానంగా నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో ఈఏడాది పూర్తిగా కరువు తాండవిస్తున్నా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు పొలాల వైపు కన్నెత్తి చూడలేదు. పల్నాడు జిల్లాలో ఇద్దరు కీలక మంత్రులు ఉన్నా వీరు ఇంతవరకు వర్షాభావంపై ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదు. ప్రధానంగా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలపై తగిన సూచనలు లేవు. సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది వరికి అవకాశం లేదని చెబుతున్నారు. లక్షా 25 వేల ఎకరాలకుగాను కేవలం ఐదువేల ఎకరాల్లోనే వరి సాగు జరిగింది. మిగతా 1.20 లక్షల ఎకరాల్లో వరికి బదులు ఏయే పంటలు వేసుకోవచ్చు అనే అంశంపై ప్రభుత్వం నుంచి తగిన మార్గదర్శకాలు లేవు. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా దాదాపు రెండు లక్షల ఎకరాల్లో మిర్చిసాగు అవుతుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లోనే మిర్చిసాగు జరిగింది. మిర్చికి డిసెంబరు తరువాత రెండుమూడు తడులు అవసరం ఉండగా సాగర్ లోనీరు లేకపోవడం వల్ల రైతులు సాగుకు తటపటాయిస్తున్నారు. సాగర్ జలాశయంలో గత ఏడాది ఇదేరోజుకు 310.85 టిఎంసిలునీరు ఉండగా ఈఏడాది సెప్టెంబరు 2న కేవలం 154టిఎంసిల నీరు నిల్వ ఉండటం గమనార్హం. మరో వైపు జిల్లాలో 4.80 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1.80 లక్షల ఎకరాల్లోనే వేశారు. మిగతా మూడు లక్షల ఎకరాల్లో భూములు ఖాళీగా ఉన్నాయి. జిల్లా మొత్తం మీద దాదాపు 26 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్ని మండలాలను ఈ ఏడాది కరవు మండలాలుగా ప్రకటించాలి? ఎన్ని మండలాలలో వేసిన పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంత వరకు అధికార పార్టీ ప్రజా ప్రతి నిధులు అధికారులతో కూడా చర్చించిన దాఖలాలులేవు. జిల్లాలోని కొన్ని మండలాల్లో నీరు అందక వేసిన పంటలు బెట్టకొస్తున్నా పంటలను కాపాడేందుకు ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ఒక వైపు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కూడా అంతంత మాత్రంగానే జరుగుతోంది. పగటి సమయంలోనే 9 గంటలు పంపుసెట్లకు విద్యుత్ ఇస్తామని ప్రకటించినా ఐదారు గంటలు కూడా ఇవ్వకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని రైతులు విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. శుక్రవారం మాచవరం సబ్ స్టేషన్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో గత వారంరోజులుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేక పంపుసెట్ల నీరు సరిగా రాక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. బోరు బావుల కింద దాదాపు లక్ష ఎకరాల్లో సాగుచేశారు. వేలాది రూపాయిలు వెచ్చించి సాగు చేసినపంటలకు నీరురాక బెట్టకు వస్తే దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అనూహ్యంగా గతకొన్ని రోజులుగా వేసవిని తలపించే విధంగా వేడిగాలులు పెరిగాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగింది. తాగు,సాగునీటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. సెప్టెంబరులో కూడా 37 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రత గత 10 ఏళ్లలో ఎప్పుడూ నమోదు కాలేదని అధికారులుచెబుతున్నారు. ఇంత వేడిగాలులతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు తలలుబాదుకుంటున్నారు. వర్షాలు లేక, కాల్వలకునీరు రాక రైతులు అల్లాడుతున్నారు.ఖరీఫ్‌సాగు చివరి దశకు చేరుకుంటున్న వేళ ఇంకా 50శాతం భూమి ఖాళీగా ఉండటం ఉమ్మడి జిల్లాలో ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

(ఎ.వి.డి.శర్మ)

ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ (గ్రౌండ్స్) మైదానంలో శనివారం పురుష అభ్యర్థులకు 8 వ రోజు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. ఈ దేహాదారుఢ్య సామర్థ్య పరీక్షలను రేంజ్ ఐ.జి. పాల్ రాజు ,బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, గుంటూరు అడ్మిన్ అడిషనల్ ఎస్పీ శ్రీమతి సుప్రజ పర్యవేక్షించారు. మొత్తం 800 మంది అభ్యర్థులకు గాను 328 మంది అభ్యర్థులు రాత పరీక్షకు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు.



కిట్స్ కళాశాలలో సిఎస్ఐ మహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా, విద్యార్థి విభాగం 2022-2023 అకడమిక్ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సిఎస్ఐ మహొత్సవం పురస్కరించుకొని, 2023-24 అకాడెమిక్ క్యాలెండర్, సిఎస్ఐ మ్యాగజైన్ 2022-23ను కిట్స్ ఛైర్మన్ కోయి సుబ్బారావు అకడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, కోడ్ తంత్ర సీఈఓ రమణ తెలిదేవారా, డాక్టర్. పసుపులేటి సాయి కిరణ్, సిద్దార్థ్ పిల్లి, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్, కోఆర్డినేటర్ డాక్టర్. ఎ. సునీత అవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు టెక్నాలజీ, కోడింగ్‌పై దష్టిసాదించాలని, వినూత్నంగా ఆలోచించి అన్ని రంగాలలో ముందుకెళ్లాలని, కోడింగ్ కాంటెస్ట్‌లో విజేతలకు రూ. 25వేలు బహుమతి ఇస్తాను అని తెలియ జేశారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన..

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఇంజినీరింగ్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఈసెల్ నిర్వహించిన ఈ ఆన్‌లీషెడ్ సమావేశానికి ఆసియా అతి చిన్న వయస్కుడైన డేటా సైంటిస్ట్ సిద్ధార్థ పిల్లితోపాటు, సేఫ్ ఎన్విరాన్ కంపెనీ నుండి వందన వెలగపూడి, బెనర్జీ బత్తినేని, మహేష్ పిన్నింటి, గుంటుపల్లి కుమార్ హాజరయ్యారు. చిన్న వయస్సులో తన అసాధారణ ప్రయాణం గురించి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కాలేజి చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కాలేజి చైర్మన్ తదితరులు